
సాక్షి
నంద్యాల
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025




బ్రహ్మోత్సవ శోభ...!

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతుంది. క్షేత్రంలోని గోపురాలు, ప్రాకారాలు, మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



కనుల పండువగా..

హొళగుంద: ముద్దటమాగిలో ఆదివారం నెణికిలింగేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కలున్న 11 గ్రామాల నుంచి వచ్చిన ఉత్సవ విగ్రహాలను ఊరేగించి పూజలు చేశారు.



శివోహం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో శ్రీశైలం భక్తజన సంద్రంగా మారుతోంది. 8లో▶

న్యూస్‌రీల్

నేడు శ్రీశైలానికి గవర్నర్ రాక



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సోమవారం సాయంత్రం శ్రీశైలానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్‌తో కలిసి సున్నిపెంట హెలిపాడ్‌ను పరిశీలించి బారికేడింగ్, వాటర్ స్ప్రింక్లింగ్ చేయాలని ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖల అధికారులను ఆదేశించారు. రెండురోజులు గవర్నర్ శ్రీశైలంలో పర్యటిస్తారని వెల్లడించారు. శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథిగృహంలో గవర్నర్‌కు వసతి, అల్పాహారం, తేనీరు, భోజనం తదితర ఏర్పాట్లు చేయాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావును ఆదేశించారు.

బుడగ జంగాల హాస్టల్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణ శివారులో స్టార్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయాన్ని, బుడగ జంగాల హాస్టల్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.ప్రేమాంతకుమార్ ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో సరదాగా కొద్దిసేపు ఆటలు ఆడి హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. నిర్వాహకులు బాలికలు, బాలురుకు వేర్వేరుగా వసతులు ఏర్పాటు చేశారా లేదా అని ఆరా తీశారు. తర్వాత రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, స్టార్ సొసైటీ నిర్వాహకులు రాజేశ్వరమ్మ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి నిరంతర దర్శనం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దర్శనం నిరంతరంగా కొనసాగించనున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణ రోజుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ మార్పును భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఇంటర్ పరీక్షల నిర్వహణపై డీఐఈఓ సునీత

నంద్యాల(న్యూటౌన్): అధికారులు సమన్వయంతో పనిచేసి ఇంటర్ పరీక్షల నిర్వహణను విజయవంతం చేయాలని డీఐఈఓ సునీత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై చీఫ్, డిపార్ట్‌మెంటల్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 29,092 మంది ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 53 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అన్ని సెంటర్ల ఎదుట 144 సెక్షన్‌తో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలు ఇచ్చినప్పుడు, జవాబు పత్రాలు తీసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్షుణ్ణంగా వివరించారు. కేంద్రాల్లో లైటింగ్, టేబుల్, బెంచీలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలకు డిపార్టుమెంట్ ఆఫీసర్లు 53, చీఫ్ సూపరింటెండెంట్లు 53, ఫ్లయింగ్ స్క్వాడ్ 3 టీంలను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, డీఈసీ సభ్యులు పీవీ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా పార్థసారథిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ రాష్ట్ర అధికారుల సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పార్థసారథిరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నంద్యాల డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో టెక్నికల్ ఏడీగా పని చేస్తున్న పార్థసారథిరెడ్డి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిన ఈయనను ఉమ్మడి కర్నూలు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు అభినందించారు.

కూటమి నేతల గూడు పురాణి

- పేదల స్థలాల ఆక్రమణకు నేతల యత్నం
- ఇంటి నిర్మాణం చేపట్టని స్థలాలపై కన్ను
- అధికారుల అండతో లబ్ధిదారులకు బెదిరింపులు
- అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టవద్దంటూ హుకూం



నంద్యాల(అర్బన్)/కోవెలకుంట్ల: పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటిస్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేసింది. గ్రామాల్లో ప్రత్యేకంగా కాలనీలను నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వకపోగా గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటోంది. అంతేకాకుండా పేదల స్థలాలను కూటమి నేతలు ఆక్రమించేందుకు యత్నం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో ఇల్లు లేని పేదలైన 47,814 మందికి స్థలాలు ఇచ్చి ఆదుకుంది. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల సాయం మంజూరుకే పరిమితం కాకుండా జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు. జిల్లాలో రూ.160.5 కోట్ల వ్యయంతో 18,865 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి పునాది, రూఫ్ తదితర దశల్లో ఉన్నాయి. జిల్లాలో 637 స్థలాలకు సంబంధించిన ఇంటి నిర్మాణాలు చేపట్టకపోగా 3,447 స్థలాలు బేస్‌మెంట్ లెవెల్‌కు తక్కువలో ఉన్నాయి. అయితే పేదలు ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ పట్టాలను రద్దు చేసి తమ వారి పేరు మీద రాయించుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు జిల్లాలో 4,084 ఇళ్ల పట్టాలను చేజిక్కించుకునేందుకు గూడు పురాణి పన్నారు. అధికారుల అండతో కూటమి నేతలు బలవంతపు హెచ్చరికలతో స్థలాలు ఖాళీ చేయాలంటూ గూండా గిరికి దిగుతున్నారు.

➤ నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన బైరేష్‌కు గతంలో ఇంటి పట్టా మంజూరైంది. ఇటీవల ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తెచ్చుకొని నిర్మాణ పనులు చేపట్టేందుకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కూటమి నేతలు ఇన్ని రోజులు ఇంటి నిర్మాణం ఎందుకు చేపట్టలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో దొరకని డబ్బు ఇప్పుడెలా సమకూరిందంటూ హెచ్చరికలు జారీ చేశారు. విధిలేని పరిస్థితుల్లో నిర్మాణాన్ని ఆపాల్సి వచ్చింది.



➤ గడివేముల మండలం కొరటమద్ది గ్రామానికి చెందిన పెసల తిరుపాలమ్మకు 2012లో ఇంటి పట్టా మంజూరైంది. బేస్ మట్టం వరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోయిన ఇంటి స్థలానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021లో ఇంటి పట్టాతో పాటు హౌసింగ్ రుణాన్ని మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం చేపట్టుకుందామంటూ ఇటీవల కుమారుడితో కలిసి నిర్మాణ పనులు మొదలు పెట్టగా స్థానిక కూటమి నాయకులు బెదిరింపులకు దిగారు. రక్షణ కల్పించాలని కుటుంబీకులతో బాధితురాలు ఎస్పీకి వినతి పత్రం అందజేసింది.

మంత్రి గారూ.. పట్టించుకోలేదు!



మంత్రి ఫరూక్ వద్ద ఆవేశంగా మాట్లాడుతున్న మహిళలు

జగనన్న ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన పట్టాలను కూటమి నాయకులు ఆక్రమించుకునేందుకు యత్నించడాన్ని జీర్ణించుకోలేని నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దాదాపు 200 మంది లబ్ధిదారులు వారం క్రితం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. అనంతరం న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి సమస్యను విన్నవించారు. స్థానిక నాయకులు కొందరు స్థలాల ఆక్రమణలకు యత్నిస్తున్నారని, అర్హులైన పేదలను గుర్తించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని మొరపెట్టుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న తమను కూటమి నాయకులు అడ్డుకోవడం మంచిది కాదని, ఎన్నడు జరగని విధంగా ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యాలను నివారించి తమ స్థలాలు తమకే ఉండేలా మంత్రికి విన్నవించారు. అయినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో పేదలకు మంజూరైన స్థలాలు, ఇళ్ల నిర్మాణాల వివరాలు

నియోజకవర్గం	స్థలాల మంజూరు	ఇంటి నిర్మాణాలు	
		మొదలు కానివి	బీబీఎల్‌లో ఉన్నవి
ఆళ్లగడ్డ	5,906	17	991
శ్రీశైలం	10,764	550	1,397
బనగానపల్లె	6,399	21	249
డోన్	8,203	3	440
నందికొట్కూరు	1,200	44	223
నంద్యాల	2,053	---	107
పాణ్యం	2,489	2	40
మొత్తం	47,814	637	3,447

ఖాళీ స్థలాల కబ్జాకు కుట్ర

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ఆక్రమించుకునేందుకు కూటమి సర్కార్ కుట్ర పన్నుతోంది. ఇందుకోసం ఇటవల 16 కాలమ్స్ కూడిన యాప్ విడుదల చేసింది. ఈ యాప్‌లో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల వివరాలు పొందుపరిచి ఉన్నాయి. లబ్ధిదారులు స్థలం మంజూరుకు అర్హులా కాదా అని సర్వే చేయాల్సి ఉంది. కరెంట్ మీటర్, నాలుగు చక్రాల వాహనం, గతంలోనే ఇల్లు ఉందా, లబ్ధిదారులు ప్రభుత్వ ఉద్యోగులా, ఐదు ఎకరాలకు మించి పొలం కలిగి ఉన్నారా అనే వివరాలను నమోదు చేసేలా సిబ్బందికి ఆదేశాలు అందాయి. ఆయా కాలనీల్లో ఇప్పటికే కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఆ ఇళ్లలో నివాసం ఉంటున్నారు. మరికొన్ని ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ఇళ్లు బేస్‌మెంట్, ఇంకొన్ని ఖాళీ స్థలాలుగా ఉన్నాయి. సర్వే ఆధారంగా వీటిని ఏం చేస్తారన్నది లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఆయా కాలనీల్లో ఖాళీ స్థలాలను ఆక్రమించుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సొంతింటి కల నేలమట్టం



అనధికారికంగా ఇళ్ల నిర్మాణాలను కూల్చి వేసిన అధికారులు (ఫైల్)

కోవెలకుంట్ల పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2,216 మంది లబ్ధిదారులకు రెండు సెంట్ల స్థలంతోపాటు పక్కాగృహాలు మంజూరు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ శివారులోని ఎస్సార్బీసీ, కోర్టు వెనుక ప్రాంగణంలో మూడు జగనన్న కాలనీల్లో 1,107 మందికి ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు కేటాయించింది. ఆయా కాలనీల్లో ఎక్కువశాతం మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని ఆయా కాలనీల్లో నివాసం ఉంటున్నారు. మిగిలిన లబ్ధిదారుల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను రద్దు చేసేలా గత నెల 25వ తేదీన కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ జీఓను ఆసరాగా చేసుకుని స్థానిక రెవెన్యూ అధికారులు ఆయా కాలనీల్లో బేస్‌మెంట్ నిర్మాణాలను కూల్చి వేశారు. ఇందిరమ్మ కాలనీ, ఎస్సార్బీసీ కాలనీల్లో 15 మంది లబ్ధిదారుల ఇళ్ల బేస్‌మెంట్లను ప్రొక్లెయిన్‌తో కూల్చి వేశారు. దీనికి తోడు గత ఐదారు నెలల నుంచి ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సైతం చేపట్ట వద్దని హుకూం జారీ చేశారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో గతంలో మంజూరైన పక్కాగృహాలను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖను ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందుకు విరుద్ధంగా కోవెలకుంట్ల రెవెన్యూ అధికారులు గతంలో చేపట్టిన నిర్మాణాలను సైతం నిలుపుదల చేయించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పైగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలంటే మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సిఫారసు తీసుకురావాలని అధికారులు బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే దీనిని అధికారులు రాజకీయం చేయడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం డబుల్ గేమ్!



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

- గ్రూపు-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై అభ్యర్థుల ఆగ్రహం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే డ్రామా చేశారు
- అబద్ధాలు ఆడటంలో బాబును మించిన లోకేష్ అని వ్యాఖ్యానిస్తున్న అభ్యర్థులు

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం డబుల్ గేమ్ ఆడిందంటూ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ల ఓట్ల కోసం ఆడియో రిలీజ్ ద్వారా సీఎం చంద్రబాబునాయుడు, ట్విట్టర్‌లో విద్యాశాఖమంత్రి లోకేష్ పెద్ద డ్రామా ఆడారని, తమను మానసికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాలు చెప్పే పోటీలో లోకేష్ ముందంజలో నిలిచారని పలువురు అభ్యర్థులు సెటైర్లు వేశారు.

డ్రామాను అర్థం చేసుకోలేని అమాయకులమా?

గ్రూపు-2లో మొత్తం 905 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టుల్లో కొన్నింటికి సంబంధించి రోస్టర్ పాయింట్ల కేటాయింపులో లోపాలు ఉన్నాయి. వీటిని సరిచేసి మెయిన్స్‌ను నిర్వహించాలని అభ్యర్థులు దాదాపు నెల రోజులుగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. అయితే అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకుంటామని శుక్రవారం మంత్రి లోకేష్ చెప్పగా.. సీఎం చంద్రబాబునాయుడు గ్రూపు-2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ శనివారం సాయంత్రం ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. ఎమ్మెల్సీ కోడ్ ఉన్న నేపథ్యంలో పరిగణనలోకి తీసుకోలేమని ఏపీపీఎస్సీ చెప్పడం, పరీక్ష యథాతథంగా ఉంటుందని ప్రకటించడం పెద్ద డ్రామా అని అభ్యర్థులు చెబుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే ముఖ్యమంత్రి, మంత్రి డ్రామాలు ఆడారని, దానిని అర్థం చేసుకోలేని అమాయకులమా అని అభ్యర్థులు అంటున్నారు.

సమయానికి హాజరు కాలేక అవస్థలు

సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేక కొంతమంది అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగిపోయారు. కర్నూలు ఏక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చారని నంద్యాలకు చెందిన రవూఫ్, చంద్రబాబు, ఆత్మకూరుకు చెందిన రమేష్‌లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వెనక్కి వెళ్లారు. కాగా.. సుంకేసులరోడ్డులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో జరుగుతున్న పేపర్-1 పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ వేర్వేరుగా పరిశీలించారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉదయం పేపర్-1 పరీక్షను నిర్వహించగా 9,993 మంది అభ్యర్థులకు గాను 8,693 మంది, అలాగే మ ధ్యాహ్నం నిర్వహించిన పేపర్-2 పరీక్షకు 9,993 మందికి గాను 8,678 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

ప్రభుత్వం స్పందించలేదు



గ్రూపు-2 మెయిన్స్ నెల రోజులుగా నిర్వహించలేదు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం పరీక్షలు వాయిదా వేయాలని ఏపీపీఎస్సీకి లేఖ రాసి చేతుల దులుపుకున్నారు. ముందు పరీక్షలు నిర్వహించి ఉంటే అభ్యర్థులకు ఇబ్బందులు తప్పేవి. – మహ్మద్ యాసిన్, ఉయ్యాలవాడ

పొలిటికల్ డ్రామా



రోస్టర్ పాయింట్ల సవరణ ప్రక్రియ మొత్తం పొలిటికల్ డ్రామాగా మారింది. వారి డ్రామాకు 92 వేల మంది బలి అవుతున్నారు. ఈ నోటిఫికేషన్ కచ్చితంగా రద్దు అవుతుంది. ప్రభుత్వం ముందు జాగ్రత్తగా కొంత సమయం తీసుకొనైనా రోస్టర్‌పాయింట్లను సవరించి ఉంటే అభ్యర్థులకు మేలు జరిగేది. – షేక్‌బాషా, ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లా

రమణీయం.. బ్రహ్మోత్సవం

- శ్రీగిరిలో నేత్రానందభరితంగా సాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను దర్శించి పులకించిన భక్తజనం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ మంత్రి



ఆలయ ప్రదక్షిణలో రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లు



శ్రీశైల మల్లన్నకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు తెస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



కేరళ కళాకారుల నృత్య ప్రదర్శన



మహిళల కోలాటం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజు ఆదివారం నీలకంఠుడు భ్రమరాంబా సమేతుడై దశకంఠుడి భుజస్కంధాలపై ఊరేగాడు. తన తల్లి కైకసీ నుంచి శివభక్తిని పుణికిపుచ్చుకున్న అపర భక్తుడు రావణుడు సాక్షాత్తు పరమేశ్వరుడే తన వద్ద ఉండాలన్న తలంపుతో కైలాసాన్నే పెకిలించి తీసుకెళ్లే క్రమంలో స్వామివారికి వాహనుడయ్యాడని పండితులు చెబుతున్నారు. స్వామివారికి శాస్త్రోక్తంగా రావణవాహన సేవ నిర్వహించారు. రావణుడి భుజస్కంధాలను అధిష్టించిన ఉత్సవమూర్తులకు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామ్మోహన్ పట్టువస్త్రాలు తీసుకురాగా, ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, అలాగే శ్రీశైలంలో గవర్నర్ పర్యటన ఉన్న నేపథ్యంలో శ్రీశైల దేవ స్థానం నుంచి ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల విధుల నిర్వహణ అధికారులు తప్ప మిగిలిన వారు జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి వాటర్‌షెడ్ యాత్ర- 2

కర్నూలు(అగ్రికల్చర్): వాటర్‌షెడ్లపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు కేంద్రప్రభుత్వం ద్వారా ఈ నెల 24 నుంచి ప్రత్యేక వాటర్‌షెడ్ యాత్ర మొదలు కానుంది. ఈ నెల 27 వరకు వాటర్‌షెడ్ యాత్ర నిర్వహిస్తున్నట్లుగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు పీడీ మాధవీలత తెలిపారు. నంద్యాల జిల్లాలో 24న ఆకుమల్ల, 25న ఎద్దుపెంట, కర్నూలు జిల్లాలో 25న హాలహర్వి, 26న పెద్దహరివాణం, కందనాతి, 27న హుస్సేనాపురం గ్రామాల్లో ప్రత్యేక బస్ ద్వారా వాటర్‌షెడ్ యాత్ర జరుగుతుందన్నారు.

భూస్థాపన కార్యక్రమము



సీర్తన: 116 :15
మా అందరికి ఆత్మీయ, అనురాగాలను పంచి మాకు ఆదర్శమూర్తిగా నిలిచిన ... 23.02.2025న ప్రభువు నందు నిద్రించియున్నారు. వీరి భూస్థాపన కార్యక్రమం 24.02.2025 (సోమవారం) మధ్యాహ్నం 3:00 గంటలకు కర్నూలులోని జోహరాపురం సియస్ఐ కొత్త సమాధుల తోటలో జరుగును.
బాధ తప్త హృదయాలతో,
భార్య శ్రీమతి ఉజ్వల ఏబెల్ గారు
Sri.M.ABEL KRUPA RAO
Senior Manager,
Indian Bank, Kurnool
జననం: 08-06-1955, మరణం: 23-02-2025
సెల్: 9010247687

క్లుప్తంగా

మార్చి 2న ఈఎంఆర్‌ఎస్ ఎంట్రెన్స్ టెస్ట్

కర్నూలు(అర్బన్): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించాల్సిన ఈఎంఆర్‌ఎస్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను మార్చి 2కు వాయిదా వేసినట్లు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ లక్ష్మి గుర్రప్ప తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్ భార్గవి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ టెస్ట్ మార్చి 2వ తేదీన ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు



రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ విజేతగా నిలిచిన కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి 10వ హ్యాండ్ బాల్ పోటీల్లో జూనియర్స్ బాలుర విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సీనియర్స్ మహిళలు, జూనియర్స్ బాలుర విభాగం పోటీలు ఆదివారం ముగిశాయి. జూనియర్స్ బాలుర విభాగంలో కర్నూలు, చిత్తూరు, శ్రీకాకుళం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. సీనియర్స్ బాలికల విభాగంలో విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లా జట్లు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు కాశీం సాహెబ్ తదితరులు ట్రోఫీ అందజేశారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



కైలాసద్వారం వద్ద పాదయాత్రగా వచ్చిన భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. ఆదివారం శ్రీశైలంలోని హఠకేశ్వరం, కైలాస ద్వారం, కమాండ్ కంట్రోల్ రూం, పారిశుద్ధ్య, 30 పడకల ఆసుపత్రి, మెడికల్ వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి పరిశీలించారు. పాదయాత్రగా తరలివస్తున్న భక్తులతో కలెక్టర్ మాట్లాడారు. అడవిమార్గంలో మెడికల్ క్యాంపులు ఉన్నాయా, ఉచితంగా భోజనాలు అందిస్తున్నారా, తాగునీటి సదుపాయం ఉందా అని ఆరా తీశారు. తర్వాత కై లాసద్వారం వద్ద మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించి ఏదైనా సమస్య వస్తే సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. అనంతరం 30పడకల ఆసుపత్రిని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

జూదరుల అరెస్ట్

అవుకు: పేకాట కేసులో ఏడుగురు టీడీపీ కార్యకర్తలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అవుకు మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామ సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో అధికారపార్టీకి చెందిన శింగనపల్లె గ్రామానికి చెందిన చాకలి కంబయ్య, చాకలి లింగమయ్య, పల్లె సుబ్బయ్య, అవుకు చెందిన తిరుమలనాయక్, చెన్నంపల్లెకు చెందిన బండెల ఉశేన్, మహేశ్వర రెడ్డి, సుంకేసులకు చెందిన సగబాల దస్తగిరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1.76 లక్షల నగదును స్వాధీనం చేసుకొని, మూడు మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.



పాతాళ గంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు





పిల్లలను భుజాన ఎత్తుకుని మల్లన్నకు చెంతకు..



పాదయాత్రగా వృద్ధులు

శివోహం

శ్రీశైల మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. నల్లమల మీదుగా ఎండను సైతం లెక్క చేయకుండా అడుగులు వేస్తూ శ్రీగిరి వైపు సాగుతున్నారు. చిన్నా పెద్దా తేడా లేదు.. వృద్ధులు సైతం పాదయాత్రగా తరలివస్తున్నారు. పలువురు భక్తులు తమ పిల్లలను భుజాలపై ఎత్తుకుని అడవిలో నడుచుకుంటూ వస్తున్నారు. నల్లమలలో సుమారు 40 కిలో మీటర్లు పాదయాత్ర చేసుకుంటూ పరమేశ్వరుడిపై భక్తిని చాటుకుంటున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, కృష్ణమ్మకు ప్రత్యేక వాయనం సమర్పిస్తున్నారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండిపోయాయి. శివదీక్షా భక్తులు ఇరుముడి సమర్పించి దీక్ష విరమిస్తున్నారు.

– శ్రీశైలంటెంపుల్



ఇరుముడితో మల్లన్న దర్శనానికి..



కైలాసద్వారం వద్ద..



నల్లమల మీదుగా శ్రీగిరికి తరలివస్తున్న భక్తజనం

మాలలను అణచివేసేందుకు కుట్ర

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు
- రాయలసీమ మాలల యుద్ధ గర్జనలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

కర్నూలు(అర్బన్): మాలలను అణచివేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పన్నారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్నూలు ఎగ్జిబిషన్ మైదానంలో రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభ నిర్వహించారు. మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, ఆహ్వాన సంఘం కన్వీనర్ యాట ఓబులేసు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు హర్షకుమార్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జాతీయ మాల మహానాడు అధ్యక్షులు జీ చెన్నయ్య, ఏబీఎస్ పార్టీ అధ్యక్షుడు పంతగాని రమేష్, స్వర్గీయ పీవీ రావు సోదరుడు పీఎస్ఎన్ మూర్తి, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షులు గోన నాగరాజు హాజరయ్యారు. ముందుగా డా.బీఆర్ అంబేద్కర్, దామోదరం సంజీవయ్య, సర్దార్ నాగప్ప, పీవీ రావు చిత్ర పటాలకు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాలలను తీవ్రంగా మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలందరిని నట్టేట ముంచారన్నారు. ఆయన మోసాలను, అబద్ధాలను చాలా ఏళ్లుగా భరిస్తు వస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, తెలంగాణ రాష్ట్రం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాల నేతలు



యుద్ధగర్జన సభకు హాజరైన మాల వర్గీయులు

మాలలందరూ ఐక్యంగా ఉండాలి

మాలలందరూ ఐక్యంగా ఉండాలని తెలంగాణ రాష్ట్రం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సభలు, సమావేశాలు పెట్టుకోవడంతో పాటు గ్రామాలకు వెళ్లి మాల ప్రజలను చైతన్యం చేయాలన్నారు. జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు జీ చెన్నయ్య మాట్లాడుతూ మంద క్రిష్ణమాదిగ బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వత్తాసు పలుకుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు. ఏబీఎస్ పార్టీ అధ్యక్షులు పంతగాని రమేష్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలు అన్ని ప్రాంతాల్లో పోటీ చేసి సత్తా చూపాలన్నారు. జిల్లాల వారీగా మాలల యుద్ధ గర్జన సభలు నిర్వహించి చంద్రబాబుకు చెమటలు పట్టించాలన్నారు. ఆహ్వాన సంఘం చైర్మన్ యాట ఓబులేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో రాయలసీమ వాసులే అధికంగా నష్టపోతారన్నారు. మాలలను కాపాడుకోవాలంటే అందరూ ఒక తాటిపైకి రావాలన్నారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అని చెప్పారు. ఈ సభలో కేధార్‌నాథ్, చెరుకూరి అశోకరత్నం, వేల్పుల జ్యోతి, లింగస్వామి, కే మాధవస్వామి, శ్యామ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ హోం కాలనీలో చోరీ

- రూ.2 లక్షలు, 5 తులాల బంగారం అపహరణ

నందికొట్కూరు: పట్టణంలోని ఆర్‌ఆర్ హోం కాలనీ లో ఉన్న ఓ ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరా ల మేరకు.. ఆకుల వెంకటరమణ బెంగళూరులోని ఓ బ్యాంకులో పని చేస్తాడు. ఇతని భార్య రోహిణి పట్టణంలోని చెంచు కాలనీలో ఉన్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్లగా, తల్లి ఆకుల బాలమ్మ ఈనెల 18న స్వగ్రామమైన ప్రాతకోటకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి చొరబడి బీరువా తాళాలు ధ్వంసం చేసి బంగారు, నగదు దోచుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరిన బాధితుడు తలుపులు పగలగొట్టిన దృశ్యాలు చూసి ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చోరీ ప్రాంతాన్ని పరిశీలించారు. 5 తులాల బంగారు, రూ. 1. 50 లక్షలు విలువ చేసే గడియారం, రూ. 2 లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.



బీరువాను పగలగొట్టిన దృశ్యం

‘స్వయం ప్రతిపత్తికి విఘాతం’

కర్నూలు(సెంట్రల్): న్యాయవాదుల చట్టానికి సవరణల పేరుతో హక్కులను హరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని అఖిల భారత లాయర్స్ అసోషియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. సవరణలు పరిశీలిస్తే న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి విఘాతం కలుగుతుందనడటంలో ఎటువంటి సందేహం లేదని పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని ఏపీ ఎస్ఈబీ ఇంజినీర్స్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... న్యాయ వాదుల చట్టానికి ఇటీవల కేంద్రప్రభుత్వం కొన్ని సవరణలు చేరుస్తూ ముసాయిదా ప్రతిని తయారు చేసిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సైతం ముగ్గురు ప్రతినిధులను కేంద్రమే నియమిస్తుండటాన్ని పరిశీలిస్తే కౌన్సిల్ సైతం తమ చేతుల్లోకి తీసుకున్నట్లుగా స్పష్టం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సింగరాజు లక్ష్మణ్, కేంద్ర కార్యదర్శి వర్గసభ్యులు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు, రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

నిలువునా ముంచారు

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-2 అభ్యర్థులను సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ నిలువునా ముంచారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలు ఆరోపించారు. గ్రూపు-2 అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయిస్తానని చెబుతూ, తమ చేతుల్లో ఏమి లేదని చెప్పడం దుర్మార్గమన్నారు. రోస్టర్ పాయింట్లను సరిచేయాలని ఆందోళన చేస్తున్న అభ్యర్థులను పోలీసులతో అరెస్టు చేయించడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు దుర్గాప్రసాదు, అన్సార్,కర్నూలు టౌన్ స్టూడెంట్‌విభాగం అధ్యక్షుడు పల్లె మధుసూదన్‌రెడ్డి , నాయకులు సాహెబ్, రఫీ, కల్యాణ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

పాదయాత్ర భక్తుడికి అస్వస్థత

- డోలిలో 5 కి.మీ దూరంలోని కైలాస ద్వారానికి చేర్చిన అటవీ సిబ్బంది

శ్రీశైలం: నల్లమల అటవీ మార్గంలో అస్వస్థతకు గురైన పాదయాత్ర భక్తుడిని అటవీ అధికారులు డోలీలో మోసుకొచ్చి వైద్య సేవలు అందించారు. కోడుమూరుకు చెందిన అజయ్ శనివారం రాత్రి వెంకటాపురం నుంచి బయలుదేరి నాగలూటి చెరువు వద్ద బస చేశాడు. ఆదివారం తెల్లవారుజామున పాదయాత్ర ప్రారంభించి మఠం బావి వద్దకు చేరుకోగానే తీవ్ర అస్వస్థతకు గురై నడవలేని స్థితికి చేరుకున్నాడు. వెంటనే 100కు డయల్ చేయడంతో ఆత్మకూరు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందింది. వారు వెంటనే స్పందించి యువకుడి వద్దకు చేరుకుని కర్రకు దుప్పటి కట్టి డోలిగా మార్చి మూడు కి.మీ దూరంలోని భీముని కొలను మండపం వద్దకు చేర్చారు. అక్కడ వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స అందించి ఆ తర్వాత మరో రెండు కి.మీ దూరంలోని కైలాసద్వారానికి డోలిలో మోసుకొచ్చి వైద్యం అందించారు. కొద్ది సేపటి తర్వాత కోలుకున్న యువకుడు అటవీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.



దోలిలో భక్తుడిని మోసుకెళ్తున్న అటవీసిబ్బంది

ఎస్టీ రిజర్వేషన్ కోసం వాల్మీకుల ఉద్యమాలు

- మార్చి 3న చలో కలెక్టరేట్
- వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు మొలగవెల్లి రామాంజనేయులు, రాష్ట్ర నాయకులు మురళీనాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వాల్మీకి/ బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కృషి చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై ఉందన్నారు. 2017లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేశారని వారు గుర్తు చేశారు. కేంద్రంలో సొంత మెజారిటీ లేని మోదీ ప్రభుత్వం కూటమి పార్టీల మద్దతుపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనలో భాగంగా మార్చి 3న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మార్చి నెల చివరి వారంలో వాల్మీకుల చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. వాల్మీకుల డిమాండ్స్‌ను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోతే వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోయ గోవిందన్న, బోయ శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

శివస్వామిపై వ్యాపారి దాడి

- ఆగ్రహించిన శివస్వాములు
- షాపు ధ్వంసం చేసిన వైనం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలో శివస్వామిపై దాడి ఘటన ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు స్థానికులు తెలిపిన మేరకు.. రాజేందర్ రెడ్డి అనే భక్తుడు శివ మాల వేసుకుని భక్తుల నుదుటిన బొట్టు పెడుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో క్షేత్ర పరిధిలోని సిద్ధి రామప్ప వాణిజ్య సముదాయం షాప్ నంబర్ జి. 91 ఎదుట ఉన్న అద్దంలో చూసి బొట్టు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో గంధంభరిణను అక్కడ పెట్టగా వ్యాపారి ఆభ్యంతరం తెలుపుతూ కర్రతో అతడి ముక్కుపై కొట్టాడు. దీనిని గమనించిన శివస్వాములు ఆగ్రహించారు. శివస్వామినే కొడతావా అంటూ షాపుపై దాడికి పాల్పడి అందులోని వస్తువులను ధ్వంసం చేశారు. తర్వాత వారే పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు ప్రయత్నించగా పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు. దాడి ఘటనపై విచారణ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





వ్యాపారస్తుడి చేతిలో దెబ్బలు తిన్న శివ స్వామి, వ్యాపారస్తుడి షాపును ధ్వంసం చేస్తున్న శివ స్వాములు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ స్థలం రేటుకే అపార్ట్‌మెంట్ స్థలం రేటుకే అపార్ట్‌మెంట్ స్థలం రేటుకే అపార్ట్‌మెంట్. కర్నూలు దగ్గర. సంప్ర: 9347325599, 9490763299. [L-794749]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పార్ట్ టైం పనిచేస్తూ లక్షలు సంపాదించే అవకాశం ఉద్యోగస్తులకు మంచి అవకాశం. సంప్ర: 7702805174. [C-820363]

PLOT FOR SALE

■ సెంటు 2 లక్షలకే KUDA అప్రూడ్ ప్లాట్ 30x50, 30x44 వెల్దుర్తి డోన్ రోడ్ కర్నూలు నందు చిన్న పెట్టుబడితో మంచి లాభాలు Ph: 7702805174 [C-SCA25001795]

WANTED

■ Wisdom అకాడమి నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సంప్ర: మెడికల్ కాలేజీ ఎదురుగా, కర్నూలు. ✆ 9177177289, 8919300841. [L-794747]

■ స్విమ్మింగ్ కోచ్ కావలెను. మా వద్ద సమ్మర్ క్యాంప్ జరగనుంది. మా స్విమ్మింగ్ పుల్‌కు అనుభవజ్ఞులైన కోచ్ కావలెను. (Male/Female) ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు. సెల్: 8121491791. [SCA25001762]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [SCA25001840]

■ ప్రముఖ కంపెనీలో Team Leaders గా కర్నూల్, నంద్యాల జిల్లాలో పనిచేయుటకు Male / Female కావలెను. Part/Full Time,Qual:Inter above, 9440351657. [T-1235632]

■ కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9666253675 [HA-99924]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA25001814]

■ హైదరాబాద్ స్టార్ హోటల్స్ షాపింగ్ మాల్స్‌లో అబ్బాయిలు & అమ్మాయిలు స్టాఫ్ కావలెను. జీ : 15000-20000 రూం+ఫుడ్ ఫ్రీ. 8019184248 [SCA25001827]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09165
70750 09185

పగలు వేడి..రాత్రి చలి

- జిల్లాలో భిన్న వాతావరణంతో ప్రజలు అవస్థలు
- పది రోజులుగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రాత్రి చల్లని గాలులు

గోస్పాడు: గత కొద్దిరోజులుగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగలు ఎండ దంచికొడుతుండగా, రాత్రి సమయాల్లో చలి పెడుతోంది. జిల్లాలో నెలకొన్న ఈ భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా శివరాత్రి వస్తే శివ శివా అంటూ చలి తగ్గిపోతుందని చెబుతుంటారు. అయితే, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో మంచు కురుస్తుండటంతో చలి గాలులు మరింత పెరుగుతున్నాయి. తెల్లవారుజామున చలితో మంచు కురుస్తోంది.

పగలు ఎండవేడిమితో భగభగలు...

గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. గరిష్ఠంగా 32 నుంచి 37డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. వారం రోజుల నుంచి తెల్లవారుజామున ప్రాంతంలో 19 నుంచి 23 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా మధ్యాహ్నం 32 నుంచి 38 డిగ్రీల పైబడి నమోదవుతున్నాయి.



మధ్యాహ్నం వేళ వెలవెలబోతున్న గోస్పాడు ప్రధాన రహదారి

శీతల పానీయాల వ్యాపారం జోరు

భానుడి భగభగలకు అప్పుడే ప్రజలు శీతలపానీయాలవైపు మొగ్గు చూపుతున్నారు. షరబత్, బత్తాయి, చెరుకు రసాలతో తోపుడు బండ్లు రోడ్ల పైకి వచ్చేస్తున్నాయి. ఐస్‌క్రీం పార్లర్‌తో తమకు గిరాకీ ఉంటుందని సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. వీటితో పాటు పుచ్చకాయలు, ముంజలు అప్పుడే మార్కెట్లోకి వచ్చేశాయి.

వారం రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా (డిగ్రీలలో)

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
17	38	21
18	38	23
19	37	23
20	37	23
21	38	23
22	37	21
23	38	22

పెరిగిన విద్యుత్ వినియోగం...

వారం రోజులుగా పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. రెండు నెలలుగా శీతాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం తగ్గింది. అయితే కొద్దిరోజులుగా గణనీయంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో తిరిగి ప్రజలు ఏసీలు, ఫ్యాన్ల వాడకం మొదలుపెట్టారు. దీంతో గతం కంటే ఈసారి విద్యుత్ వాడకం పెరుగుతోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగు తుండటంతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండ వేడిమి అధికంగా ఉంది



గతంలో ఫిబ్రవరి నెలలో ఇలాంటి ఎండ వేడిమి కనిపించేది కాదు. రైతులు పొలాల్లో పని చేసినా శ్రమ అనిపించేది కాదు. రాత్రి వేళల్లో కొంత మేరకు చలి అధికంగా ఉంటుంది. అయితే పగటి వేళల్లో మాత్రం ఎండ వేడిమి కూడా అధికంగా ఉంటూ ఉక్కపోతను తలపిస్తుంది. ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఎండ వేడిమితో ఈ ఏడాది ఏ మేరకు అవస్థలు పడాలోనని భయంగా ఉంది.

–వెంకటేశ్వరరెడ్డి, గోస్పాడు

జాగ్రత్తలు తీసుకోవాలి



ఫిబ్రవరి మాసం తొలి నుంచి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇప్పటి నుంచి ప్రజలు ముందస్తుగా ఆరోగ్యపరమైన చర్యలు చేపట్టాలి. రానున్న ఉష్ణోగ్రతలు పెరుగుతాయి తప్ప తగ్గవు. ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆదిశగా వైద్య ఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించనుంది.

– వెంకటరమణ, డీఎంహెచ్ఓ, నంద్యాల